ప్రజాశక్తి

5

గురువారం 23 అక్టోబర్ 2025

అల్లూరి సీతారామరాజు

24న అరకులో జాబ్ మేళా

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అరకులో ఈ నెల 24న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి .పి.రోహిణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఐటిఐ కళాశాల ఆవరణలో నిర్వహించనున్న జాబ్‌మేళాకు అపోలో ఫార్మసీ, నవత రోడ్ ట్రన్స్పోర్ట్, కేర్ ఫర్ యు, మీషో తదితర 12 కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నారని వెల్లడించారు. అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, బిటెక్ ఆపై చదువు పూర్తి చేసిన వారు అర్హులన్నారు. విద్యార్హత ధ్రువపత్రాల జెరాక్స్ కాపీలతో పాటు పాన్, ఆధార్ కార్డులతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్వ్యూలో ఎంపిక కాబడిన అభ్యర్థులకు నెలకు రూ.10వేల నుండి 20వేల వరకు జీతం ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు https://naipunyam.ap.gov.in వెబ్సైట్ కు లేదా 9177517373, 7569923256 ఫోన్ నంబర్లకు సంప్రదించాలన్నారు.

కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి

-ఆసుపత్రి శానిటేషన్ కార్మికుల సమ్మె

అరకులో నినాదాలు చేస్తున్న ఉమామహేశ్వరరావు, కార్మికులు

ముంచంగిపుట్టులో నినాదాలు చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అల్లూరి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని,కనీసవేతనం రూ 26 చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం అరకులోయ ఏరియా ఆసుపత్రి వద్ద శానిటేషన్ కార్మికులు సమ్మె బాట పట్టారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెకు వెళ్తామని నోటీసులు ఇచ్చినప్పటికీ కాంట్రాక్టర్, ప్రభుత్వం కనీసం స్పందించలేదన్నారు. దీంతో సమ్మె కు దిగినట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి జె భగత్ రాం, శానిటేషన్ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు రఘు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అల్లూరి జిల్లాలో పాడేరు ప్రభుత్వ ఆసుపత్రి, మెడికల్ కాలేజీ, అరకు ఏరియా ఆసుపత్రి, ముంచంగిపుట్టు, చింతపల్లి ప్రభుత్వ అసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అధికారులకు అనేకమార్లు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ పరిష్కారం చేయలేదన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ 26 వేల చెల్లించాలని, టెండర్ విధానం రద్దు చేసి, ప్రభుత్వమే జీతం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు పర్మినెంట్ చేయాలన్నారు. కొత్త పిఎఫ్, ప్రధానంగా ఇపిఎఫ్ తప్పిదాలు సరిచేయాలని, ఇఎస్ఐ కార్డులు ఇవ్వాలన్నారు. ప్రతినెలా మొదటి వారంలో జీతాలు చెల్లించాలని చెప్పారు. గ్రూప్ ఇన్సూరెన్స్, సీనియార్టీ ప్రకారం సూపర్ వైజర్ పోస్టులు, షిఫ్ట్ డ్యూటీలు, రెస్టు రూమ్స్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాలన్న, రాము, వరహాలమ్మ, ద్రౌపతి, సుమిత్ర, కృపా, కోటి, కుమారి, బురుంద, తదితరులు కార్మికులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు:మండలంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లోనీ శానిటైజేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం సమ్మెను సిఐటియు మండల కార్యదర్శి, కె శంకరరావు ఆధ్వర్యంలో స్థానిక సిహెచ్‌సి వద్ద చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శానిటైజేషన్ వర్కర్లకు కనీస వేతనం 26000 పెంచి, 2024 లో పెంచిన జీవో ప్రకారం పిఎఫ్ సమస్య పరిష్కరించాలనీ డిమాండ్ చేశారు. బకాయి వేతనాలు తక్షణమే చెల్లించి టెండర్ విధానం రద్దు చేయాలన్నారు.ఈ సమ్మెకు సిఐటియు పూర్వ కార్యదర్శి పి భీమరాజు, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం శ్రీను, నాయకులు ఎస్.గాసిరాం మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్‌లు కౌసల్య, కె.సుబ్బలక్ష్మి, ఎస్.చిట్టిబాబు, బి.కాశీనాథ్, కే.దేవి, ఎస్.మచ్చి కొండబాబు, దాసన్న, వసంత, ఎస్ సత్యలమ్మ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె

చింతపల్లి : ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మెను కొనసాగిస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ స్పష్టం చేశారు. ఆసుపత్రి యాజమాన్యాలు, కాంట్రాక్టర్లు కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే సుమారు 20 రోజుల క్రితం సంబంధిత సూపరింటెండెంట్లకు వినతిపత్రాలు అందజేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరలు ఆకాశాన్ని అంటుతున్న సమయంలో కూడా కార్మికుల జీతాల్లో భారీ కోతలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 అక్టోబరులో పెరిగిన రేట్ల ప్రకారం కనీసం రూ.18,600 ఇవ్వాలి, కానీ కేవలం రూ.11,000 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.రామారావు, డి.ఈశ్వరరావు, డి.గిరిబాబు, జి.గిరి, జె.రాములమ్మ, ఎస్. గున్నమ్మ, ఎస్. గంగమ్మ, పి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో నిరసన చేపడుతున్న చిన్నయ్యపడాల్, కార్మికులు

కొమరం భీం స్ఫూర్తితో..

ఆదివాసీ హక్కుల సాధనకు పోరాటం

సిపిఎం జిల్లా నాయకులు సీసం సురేష్

దేవీపట్నం: నివాళులర్పిస్తున్న తెల్లం శేఖర్

చింతూరు: నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా నాయకులు సీసం సురేష్

ప్రజాశక్తి- చింతూరు: ఆదివాసీల హక్కులు కాపాడుకోవడం కోసం ఆదివాసీ పోరాటయోధుడు కొమరం భీం పోరాట స్ఫూర్తితో హక్కుల సాధన కోసం ప్రతి ఆదివాసీ ఉద్యమించాలని సిపిఎం జిల్లా నాయకులు సీసం సురేష్ పిలుపునిచ్చారు. బుధవారం చింతూరు పార్టీ కార్యాలయంలో అమరజీవి ఆదివాసీ ఉద్యమ నాయకుడు కొమరం భీమ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మండల సీనియర్ నాయకులు మడకం చిన్నయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ ప్రభుత్వం ఆదివాసులపై చేస్తున్న దుర్మార్గపు దోపిడిపై ప్రజలను ఐక్యం చేసి పోరాటం చేసిన మహా నాయకుడు కొమరంభీం అని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకై ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు పోడియం లక్ష్మణ్, రమేష్ కారం మనోజ్, కూర సత్యనారాయణ, కలుముల ముత్తయ్య , కట్టం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం: దేవారం పంచాయతీ పరిధిలో పోతవరం రామాలయంలో కొమరం భీం జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించామని ఎపి ఆదివాసీ జెఎసి రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ తెలిపారు. ఆదివాసీల హక్కులు చట్టాల పరిరక్షణకు అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు కొమరంభీం అని కొనియాడారు. భారత్ ఆదివాసీ పార్టీ దేవీపట్నం మండల అధ్యక్షులు చవలం విద్యాసాగర్ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతంలోని ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ తక్షణమే స్పందించి టిఏసి ద్వారా తీర్మానం చేసి షెడ్యూల్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం తక్షణమే ప్రకటించి ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో వైసిపి యూత్ కన్వీనర్ శరభవరం, దేవారం ఎంపిటిసి సభ్యులు తుర్రం జగదీష్ దొర, కారం రంగారావు దొర తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: మండలంలోని స్థానిక సిపిఎం కార్యాలయంలో కొమరం భీం జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య మాట్లాడుతూ కొమరం భీం ఆశయాలను ముందుకు తీసుకెళ్లినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు మడకం నాగమణి, పాయం సీతారామయ్య,మండల గిరిజన సంఘం నాయకులు తెల్లం తమ్మయ్య,పార్టీ సీనియర్ నాయకులు మడకం జోగయ్య పార్టీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గొంటువానిపాలెం అక్రమ మైనింగ్‌పై విచారణ జరపాలి

ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి - అడ్డతీగల: అడ్డతీగల మండలం నల్లకొండ అక్రమ మైనింగ్ తవ్వకాల్లో ఒక వ్యక్తి గోతిలో పడి మృతి చెందిన ఘటనపై విచారణ జరిపించాలని, మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, దీనికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు కోణా. గణేష్ డిమాండ్ చేశారు. రంపచోడవరం నియోజకవర్గం పరిధిలో గిరిజన చట్టాలకు విరుద్ధంగా అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్నారని తగు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాజవొమ్మంగి: గొంటువాని పాలెం, నల్లకొండ మెటల్ క్వారీలో రోజువారి కూలిగా పనిచేస్తున్న గంగంపాలెం గ్రామానికి చెందిన వ్యక్తిపై మట్టిపడి మృతి చెందిన సంఘటనపై జ్యుడీషియల్ విచారణ జరపాలని మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని గిరిజన సంఘ మండల కార్యదర్శి కొండ్ల సూరి బాబు డిమాండ్ చేశారు.తక్షణమే క్వారీని సీజ్ చేయాలని, జరిగిన సంఘటనపై ఎమ్మెల్యే స్పందించాలని డిమాండ్ చేశారు.

ఆటోను ఢీకొన్న బొలెరో

ఒకరు మృతి.. తొమ్మిది మందికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- జికె వీధి:

మండలంలోని రింతాడ సమీపంలో ఆగి ఉన్న కూరగాయల ఆటోను వేగంగా దూసుకొచ్చిన బొలెరా వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా, మరొకరికి కాళ్లు విరిగిపోయాయి. మరో తొమ్మిదిమంది స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన గూడెం కొత్త వీధి మండలం రింతాడ మాలీవీధి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే గూడెంకొత్త వీధి మండలం సంకాడ పంచాయతీ చిత్తమామిడి గ్రామానికి చెందిన ఒక ఆటోలో రైతులు పండించిన కూరగాయలను చింతపల్లి వారపు సంతకు తరలిస్తున్నారు. రింతాడ మాలీవీధి గ్రామంలో మరికొందరు రైతులు కూరగాయలు ఎక్కిస్తున్న సమయంలో శాంతిసాధన పాఠశాలకు చెందిన బొలెరా వాహనం వేగంగా వచ్చి ఆటోకు బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న 11 మందిలో తులసి (60) మృతి చెందింది. పలువురు గాయపడ్డారు. క్షతగ్రాతులను హుటాహుటిన చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాళ్ళు విరిగిన వారిని మెరుగైన వైద్యసేవల కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై జికె వీధి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్

20న చలో రాజధానిని జయప్రదం చేయండి

ఇఇఎఫ్ఐ పిలుపు

ప్రజాశక్తి- జీకే వీధి: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి నవంబర్ 20న చేపడుతున్న చలో రాజధాని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటియు పిలుపు నిచ్చింది. కాంటాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయడం తదితర సమస్యలపై యాజమాన్యంతో పలుమార్లు చర్చించి నా స్పందన కరువైందని, సమస్యలపై ఎపి టవర్ జెఎసి, ఎపి విద్యుత్ గ్రేడ్ యూనియన్ కమిటీ, ఎపి విద్యుత్ గ్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ సమ్మెకు పిలుపు నిచ్చింది.ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ప్రధానంగా కాంటాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంస్థలు విలీనం చేసి రెగ్యుల రైజ్ చేయాలని గ్రేడ్ 2 జెఎల్ఎంలకు ఉద్యోగ సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్లు పరిష్కరించాలని విజయవాడలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు కోరారు.

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ తదితరులు

పంచాయతీ భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -మారేడుమిల్లి: మారేడుమిల్లి మండలం పుల్లంగిలో పంచాయతీ భవనానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, విజయ భాస్కర్ ఆదేశాల మేరకు మండల టిడిపి అధ్యక్షులు గురుకు శేషుకుమార్, పుల్లంగి సర్పంచ్ జార్జిబాబు అధ్యక్షతన శంకుస్థాపన చేశారు. ఎట్టకేలకు పంచాయతీ భవనం మంజూరైనందుకు సర్పంచ్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ఎంపిటిసి బున్నమ్మ, మండల టిడిపి అధ్యక్షులు గురుకు శేషుకుమార్, మండల జనసేన అధ్యక్షులు దుర్గా ప్రసాద్, మండల బిజెపి అధ్యక్షులు, మండల తెలుగు యువత అధ్యక్షులు మల్లా బలరాం, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు డాక్టర్ రాజ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ మహిళల హక్కులు, రక్షణకు పోరాటాలు

-ఐద్వా జాతీయ కమిటీ కోశాధికారి ఎస్.పుణ్యవతి

మాట్లాడుతున్న పుణ్యవతి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:గిరిజన ప్రాంతంలో ఆదివాసి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించాలని ఐద్వా జాతీయ కమిటీ కోశాధికారి ఎస్ పుణ్యవతి కార్యకర్తలకు పిలుపునిచ్చారు.అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసి గిరిజన సంఘం భవనంలో రెండు రోజులు పాటు ఐద్వా మహిళా సంఘం జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఐద్వా జాతీయ కమిటీ కోశాధికారి ఎస్ పుణ్యవతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్పొరేట్ కంపెనీలు గిరిజన ప్రాంతంలో చొరబడి హక్కులు, చట్టాన్ని ఉల్లంఘించి సంపదను కొల్లగొట్టాలనే ఆలోచనతో ఉన్నారని, వారిని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో తెలుగుదేశం రెండు పార్టీలు కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్నాయని, దీన్ని గమనించాలన్నారు.మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐద్వా పోరాడుతుందని తెలిపారు. మహిళల్లో ప్రశ్నించేతత్వం రావాలని చెప్పారు. మహిళలు హక్కులు, చట్టాలు తెలుసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో నేటికీ విద్య,వైద్యం మహిళలకు అందిన దాఖలు లేదని, నేటికీ గర్భిణీలను డోలిమోతలతోనే ఆస్పత్రికి తరలించవలసిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా గిరిజన మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ హేమావతి, జిల్లా నాయకులు వివి జయ, జిల్లా ఉపాధ్యక్షులు దేవుడమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి శశికళ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి ప్రజలు సహకరించాలి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : పర్యావరణ హిత పర్యాటక అభివృద్ధికి జిల్లా ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బుధవారం పాడేరు ఫారెస్ట్ డివిజన్‌లో వంజంగి మేఘాల కొండ, అరకు ఫారెస్ట్ డివిజన్ లో మాడగడ వ్యూ పాయింట్ అభివృద్ధిపై, పాడేరు మండలంలోని పంచాయితీలు వంజంగి, లగిశపల్లి, కాడేరు మూడు పంచాయితీలు, అరకు మండలంలోని మాడగడ పంచాయితీ పకన గూడ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సమావేశం నిర్వహించారు. వంజంగి, మాడగడ పర్యాటక అభివృద్ధికై స్థానిక ప్రజానీక అభిప్రాయాలను తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వనసంరక్షణ సమితి ఆధ్వర్యంలో వంజంగి, మాడగడ అభివృద్ధికై స్థానికులు, ఫారెస్ట్, రెవెన్యూ సహకారముతో అభివృద్ధి ప్రణాళికలు రచించుటకు జిల్లా యంత్రాగం గ్రామసభలు పెట్టి ప్రజల సలహాలు సూచనలుతో ముందుకు వెలుతుందన్నారు. స్థానిక ప్రజానీకానికి లబ్ది చేకూరే విధముగానే జిల్లా అధికార యంత్రాంగం పనితీరు ఉంటుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం అభివృద్ధి ఏర్పాటు పై సాధ్యాసాధ్యాలను పరిశీలించడానికి జిల్లా అధికార యంత్రాంగం ముందుకు వెళుతుందన్నారు. కమ్యూనిటీకి లబ్ది చేకూరే విధముగా కమ్యూనిటీ బేస్డ్ డెవలప్మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల ఆర్థిక , జీవన పరిస్థితులు మెరుగు పరచడానికి కృషి చేస్తున్నామన్నారు.జిల్లా పర్యాటక అభివృద్ధి విషయంలో ప్రజలు ఎటువంటి అపోహలకు తావివ్వరాదని కోరారు. ఆయా ప్రాంతాలు పర్యాటకముగా అభివృద్ధి చెందితే వాటి నుండి వచ్చే సంపద ఆయా ప్రాంతాల ప్రజలకు జీవన పరిస్థితులు మెరుగుపరచడానికి ఎంతో దోహద పడతాయన్నారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలను సావధానముగా విని పరిష్కారానికి , మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమములో ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారిణి తిరుమణి శ్రీ పూజ, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ పి.వి. సందీప్ రెడ్డి, సహాయ కలెక్టర్ సాహిత్, ఇంచార్జ్ ఆర్డివో పాడేరు ఎస్.వి.ఎస్. లోకేశ్వరరావు వంజంగి , లగిశపల్లి , కాడేరు , మాడగడ పంచాయతీల సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, స్వచ్చంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు .

కలెక్టర్‌తో మాట్లాడుతున్న అధికారులు

ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలతో డిఇఒ

శతశాతం ఫలితాలు సాధించాలి

జిల్లా విద్యాశాఖాధికారి ఆకస్మిక పర్యటన

ప్రజాశక్తి- అడ్డతీగల: స్థానిక మండల కేంద్రం రాయిపల్లి జెడ్‌పి హైస్కూల్‌ను బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెచ్ఎం, సబ్జెక్టు ఉపాధ్యాయులు అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని విద్యార్థుల నమోదు పెంచాలని, విద్యార్థుల హాజరు వందశాతం ఉండాలని ఆదేశించారు. పదోతరగతిలో శతశాతం ఫలితాలు సాధించాలన్నారు. ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని, బోధన ఉపకారణాలను ఉపయోగించాలని, డైరీ, లెసన్‌ప్లాన్ తప్పనిసరిగా ఉండాలని, పదో తరగతి విద్యార్థులు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ఎంఇఒలు శ్రీనివాసరావు, తాతబ్బాయిదొర, సత్యనారాయణదొర, హెచ్ఎంలు కె.వరప్రసాద్, కె.ఈశ్వరరావు, సి.హెచ్.చిన్నబ్బాయి, ఉపాధ్యాయులు పి.మంగరాజు, కె.గంగరాజు, ఎ.చినబాబు, ఆర్.వెంకటేశ్వర్లు.ఎ. గాంధీ, కె.బాబూరావుదొర తదితరులు పాల్గొన్నారు.

చెత్తా చెదారంతో బావి

-అంగన్వాడీ పిల్లలకు అదే నీటితో వంట

చెత్తతో నిండిన బావి

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రంలోని స్థానిక ఐసిడిఎస్ ఆఫీస్ వెనుకాల ఉన్న నుయ్యి ప్రస్తుతం చెత్తా, నత్తగుల్లలు, బూజులతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ నుయ్యి నుంచే అంగన్వాడి సెంటర్‌లో ప్రతిరోజు పిల్లల భోజన వంటలు జరుగుతున్నాయని, స్థానిక ప్రజలు కూడా ఇదే నీటిని తాగుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కలుషిత నీటితో ప్రజల్లో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వారు తెలిపారు. హెడ్‌క్వార్టర్ లోనే పరిస్థితి ఇంత దయనీయంగా ఉంటే, మారుమూల గ్రామాల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థమవుతుందని స్థానికులు తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి నుయ్యిని శుభ్రపరచి, పరిశుభ్రమైన నీటిని ప్రజలకు అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నిధుల కేటాయింపునకు ప్రతిపాదన

మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని జోలా పుట్టు పంచాయతీ లబ్బూరు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో తలెత్తిన నీటి ఎద్దడిపై ఇటీవల కాలంలో పలు దిన పత్రికల్లో ప్రచురితమైన కథనాలకు జిల్లా కలెక్టర్ స్పందించారు. బుధవారం జిల్లా ఆర్డబ్ల్యూఎస్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులను పంపించి నీటి వనరుల ప్రదేశాన్ని పరిశీలించి, నిధుల ప్రతిపాదన ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు అధికారులు నీటి వనరులను పరిశీలించారు. నీటి సమస్య పరిష్కరించడానికి సుమారు అంచన విలువ 40 లక్షల నిధులు కేటాయించుటకు ప్రభుత్వానికి ప్రతిపాదనగా నివేదికను సిద్ధం చేశామని ఆర్డబ్ల్యూఎస్ ఈఈ నాగేశ్వరరావు, ట్రైబల్ వెల్ఫేర్ రాము తెలిపారు. ఎస్ఎంసి కమిటీ చైర్మన్ రామదాసు మాట్లాడుతూ పాఠశాలలోని ప్రహరీ గోడ, నైట్ వాచ్ మన్, విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెఈ రాజేష్, ట్రైబల్ వెల్ఫేర్ వర్క్ ఇన్స్పెక్టర్ మల్లేష్, వైసిపి నేత అరబీరు జగబంధు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పారదర్శకంగా కొత్త విద్యుత్ కనెక్షన్లు : సిఎండి

ప్రజాశక్తి- సీతమ్మధార: కొత్త విద్యుత్ కనెక్షన్ల జారీలో పారదర్శకత, సత్వర సేవలు అందించేందుకు ఎపిఇఆర్‌సి నియమావళికి అనుగుణంగా నూతన విధానం అమల్లోకి వచ్చిందని ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి ప్రకటనలో వెల్లడించారు. ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా విద్యుత్ కనెక్షన్ ప్రక్రియను సులభతరం చేయడం, ఛార్జీల అమలులో పారదర్శకతను తీసుకురావడమే లక్ష్యంగా కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ నిబంధనలకు అనుగుణంగా, విద్యుత్ నియంత్రణమండలిలోని మార్గదర్శకాలకు అవసరమైన సవరణలు చేపట్టినట్లు తెలిపారు. ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని అన్ని సర్కిళ్ళలో ఒకే విధమైన, పారదర్శక ఛార్జీలను అమలు చేయనున్నామన్నారు. ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్లు, ఎస్టిమేట్ తయారీ అవసరం లేకుండా కొత్త నియమావళి అమలుతో విద్యుత్ కనెక్షన్ జారీ ప్రక్రియ మరింత సరళంగా, పారదర్శకంగా, వేగవంతంగా మారనుందని వెల్లడించారు కొత్త విధానంలో ఇప్పటికే విద్యుదీకరణ జరిగిన కిలోమీటర్ల పరిధిలోని ప్రాంతంలో 150 కిలోవాట్ల వరకు ఎల్‌టి కనెక్షన్లకు,అదనపు లోడ్‌కు ఫిక్స్‌డ్ కనెక్షన్ ఛార్జీలు నిర్ణయించబడ్డాయన్నారు. కిలోమీటరు దూరానికి మించి ఉన్న ప్రాంతాలకు, కొత్త లేఅవుట్ల విద్యుదీకరణకు, వ్యవసాయ, అనుబంధ కనెక్షన్లకు, అండర్‌గ్రౌండ్ కేబులింగ్ అవసరమయ్యే సందర్భాలలో ఈ ఛార్జీలు వర్తించవన్నారు. అప్లికేషన్ ఫీజు, సెక్యూరిటీ డిపాజిట్ వంటి ఇతర రుసుములు మాత్రం ప్రస్తుత నియమావళి ప్రకారం కొనసాగుతాయన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై నిర్లక్ష్యం వద్దు

ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీపూజ

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ శ్రీపూజ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాఠశాలల విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించనని, కఠిన చర్యలు తప్పవని ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీపూజ హెచ్చరించారు. ఇటీవల వరుసగా జరుగుతున్న విద్యార్థులు అనారోగ్యం, అదృశ్యమైన సంఘటనల నేపథ్యంలో బుధవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో ప్రిన్సిపాల్స్, హెచ్ఎంలు, ఎటిడబ్ల్యూఒలు, ఎంఇఒలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యం ప్రాథమిక బాధ్యత అని అన్నారు. జిల్లాలో పోషకాహార లోపం కారణంగా ఇన్ఫెక్షన్లు వేగంగా వస్తాయని, ఈ నేపథ్యంలో సిక్ బోర్డర్స్ రిపోర్ట్‌ను చురుకుగా నిర్వహించాలని ఆదేశించారు. హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయిన విద్యార్థి నేరుగా ఇంటికి వెళ్లకుండా రోగం నయమైనప్పటికీ సమస్యలు రాకుండా నిరోధించడానికి పది రోజుల పాటు టీచర్ పర్యవేక్షణలో ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులను కెజిహెచ్ వంటి ఆసుపత్రులకు పంపినప్పుడు, పేరెంట్స్ భయపడే అవకాశం ఉన్నందున టీచర్లు తప్పనిసరిగా పిల్లలతో తోడుగా ఉండాలని, ధైర్యం చెప్పి వ్యక్తిగత శ్రద్ధ చూపాలని ఆదేశించారు. దసరా సెలవుల తర్వాత పాఠశాలల్లో హెల్త్ చెకప్స్ వివరాలు, హెల్త్ కార్డ్స్ నిర్వహణను ఆరా తీశారు. ప్రతి విద్యార్థికి హెల్త్ బుక్ (రికార్డు) తప్పక మైంటైన్ చేయాలని సూచించారు. పాఠశాలల్లో శానిటేషన్, క్లోరినేషన్ ప్రక్రియలను, గోడౌన్స్, వంటశాలల పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థుల భద్రత కోసం ఇన్ అండ్ అవుట్ రిజిస్టర్, సందర్శకుల రిజిస్టర్ నిర్వహణ తప్పనిసరని, అత్యవసర పరిస్థితుల్లోనూ విద్యార్థులు టీచర్ తోడుతో మాత్రమే బయటకు వెళ్లాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ కె.సాహిత్, టిడబ్ల్యూ డిడి పిబికె పరిమళ, 11 మండలాల ప్రిన్సిపాల్స్, హెచ్ఎంలు, ఎటిడబ్ల్యూఒలు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో వైద్య సేవల మెరుగునకు కృషి

జిల్లా కలెక్టర్‌ను కలిసిన డిఎంహెచ్‌ఒ కృష్ణమూర్తి నాయక్

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి పాడేరు: అల్లూరి జిల్లాలో ముందస్తు ప్రణాళికలతో వైద్యసేవల విస్తరణకు చర్యలు తీసుకున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణమూర్తి నాయక్ జిల్లా కలెక్టర్కు వివరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన బుధవారం కలెక్టర్‌ని మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామ రాజు జిల్లా పరిధిలోని 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా గిరిజనులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను జిల్లా కలెక్టర్కు వివరించారు. పీహెచ్‌సీల పరిధిలో విధులు నిర్వహిస్తున్న వైద్య అధికారులు, క్షేత్ర వైద్య సిబ్బంది, ఇతర శాఖల సిబ్బందితో సమన్వయం చేస్తూ, ముందస్తు ప్రణాళికల ద్వారా వైద్య సేవలను విస్తరింపజేస్తామని తెలిపారు. డోలి మోతలు, మాతా-శిశు మరణాలను నివారించడానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. 108 అంబులెన్స్, ఐ.టి.డి.ఎ అంబులెన్స్ సేవలను జిల్లా వ్యాప్తంగా ఒకే వేదికపైకి తెచ్చి వాట్సప్ గ్రూప్ ను సృష్టించడం జరిగిందని, తద్వారా అనారోగ్యంతో బాధపడుతున్న లేదా అత్యవసర వైద్యంకు (క్రిటికల్ కేర్ ట్రాన్స్ పోర్టేషన్) వేచి ఉన్నప్రతి గిరిజనుడికి సకాలంలో అంబులెన్స్‌లో తరలించి ఇబ్బందులు లేకుండా జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో హెల్త్ కాల్ సెంటర్ ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు సమ్మె బాట పట్టడంతో వైద్య సిబ్బంది అక్టోబర్ నెల జీతాల చెల్లింపు విషయమై సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వ ఆదేశానుసారం జీతాలు సమయానికి చెల్లించేందుకు డ్రాయింగ్ అధికారులను నియమించి అన్ని విధాలా చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్కు వివరించారు.

తుప్పల నడుమ సచివాలయం

సచివాలయం చుట్టూ పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ మండలం పద్మాపురం 2 యండపల్లివలస గ్రామ సచివాలయం కార్యాలయం చుట్టు పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. సచివాలయానికి చుట్టూ తుప్పలు పెరిగిపోయి అపరిశుభ్రంగా ఉండడంతో అక్కడికి వచ్చే ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రభుత్వం ఒకపక్క స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర పేరుతో రోజురోజుకు స్వచ్ఛభారత్ కార్యక్రమాలు పిలుపునిస్తున్నప్పటికీ పద్మాపురం పంచాయతీలో మాత్రం పరిశుభ్రతపై పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రతి రోజు వివిధ పనుల కోసం ఆయా వివిధ గ్రామాల గ్రామస్థులు సచివాలయానికి వస్తుంటారు. తుప్పలతో పాములు, విషపూరిత కీటకాలు వస్తున్నాయని దీంతో ఏ సమయంలో ఏం జరుగుతుందోనన్న భయాందోళనతో వచ్చివెళ్తున్నారు.

గర్భిణికి తప్పని డోలీ కష్టాలు

డోలీలో మోసుకుంటూ వాగు దాటిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని చీకుమద్దుల పంచాయతీ పరిధిలోని కారేగరువు పీవీటీజీ గ్రామానికి చెందిన కొర్ర సత్తిబాబు భార్య కొర్ర కొండమ్మకు పురిటి నొప్పులు రావడంతో ఆశా వర్కర్ మర్రి కాసులమ్మ 108 అంబులెన్స్ సమాచారం అందించింది. రోడ్డు అస్తవ్యస్తంగా ఉండడంతో వాహనం గ్రామానికి చేరుకోలేక పోయింది. దీంతో డోలీలతో గర్భిణీని మోసుకుంటూ గెడ్డను దాటించాల్సిన పరిస్థితి నెలకొంది.నిర్మాణంలో ఉన్న రహదారిలో కల్వర్ట్ గొట్టాలు వదిలేశారు. దీంతో గ్రామస్థులు కొండమ్మను కిలోమీటర్ దూరం వరకు డోలిలో మోసుకుంటూ అంబులెన్స్ వరకు తీసుకెళ్లాల్సి వచ్చింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి పనులను పూర్తి చేసి డోలి కష్టాలకు ముగింపు పలకాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నకిలీ మద్యం నియంత్రణకు చర్యలు

యాప్‌తో అవగాహన కల్పిస్తున్న దొన్నుదొర

ప్రజాశక్తి-అరకులోయరూరల్: అరకులోయ మండల కేంద్రంలోని బుధవారం ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్, అరకు ఇంచార్జీ సియ్యారి దొన్ను దొర మద్యం దుకాణాలను పరిశీలించారు. ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి మద్యం తీసుకోవాలని సూచనలు చేశారు. క్యూఆర్ కోడ్ ద్వారా నకిలీ మందా మంచిమందా నిర్ధారించబడుతుందని తెలిపారు. గతంలో వైసిపి పాలనలో కల్తీ మద్యం తాగి చాలామంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం నకిలీ మద్యం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, దీని కోసం ప్రత్యేక యాప్ పెట్టి క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి మద్యం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు శెట్టి బాబురావు, పెదలబుడు సర్పంచ్ పి దాసు బాబు, మాదల సర్పంచ్ శ్రీనివాస రావు, ఉపసర్పంచ్ విజయనిర్మల, కె నాగరాజు, వెంకట్రావు పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలోని హెడ్‌క్వార్టర్‌లో తాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు వంటి సమస్యలు పరిష్కరించాలని ఆదివాసి మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్. హైమావతి, మండల కార్యదర్శి కె. అరుణ ప్రకటనలో కోరారు. ఆగస్టు 13న మూడు నెలల క్రితం ఈ సమస్యలపై స్పెషల్ ఆఫీసర్ వాహనాన్ని అడ్డుకొని వినతిపత్రం సమర్పించినా, నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు తెలిపారు. వీధి దీపాలు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులకు కనీసం స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం కాలనీ, మోదమాంబ కాలనీలలో వీధి దీపాలు లేక రాత్రి సమయంలో గిరిజనులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

ఎరువులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ వెంకమ్మ

సబ్సిడీపై ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి -కూనవరం : మండలంలోని కుతురు గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో 90 శాతం ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ వినోద్ రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొగ్గ వెంకమ్మ మాట్లాడుతూ రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందించాలన్నారు. వర్షాలు వల్ల పంటలు దెబ్బతిన్న రైతాంగాన్ని ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. మాజీ సర్పంచ్ సీతారామయ్య రైతులు పాల్గొన్నారు.

విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎస్ఐ వెంకటేష్

అమరవీరుల ప్రాణత్యాగం మరువలేనిది

ప్రజాశక్తి - గంగవరం : అమరవీరుల ప్రాణత్యాగం మరువలేనిదని ఎస్ఐ వెంకటేష్, ఎస్ఎం మహర్షి కొనియాడారు. బుధవారం గంగవరం మండలం జగ్గంపాలెం ఎంప్లాయ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోలీస్ సంస్మరణ సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేష్ విద్యార్థులతో ప్రాణాలు కోల్పోయిన ప్రతి ఒక్కరికి నివాళులర్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలు పెట్టి పిల్లలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ తుర్రం రంగబాబు, కోసు మధుబాబు, వీక కృష్ణబాబు, ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు పూసం బాపిరాజుదొర, ఉపాధ్యక్షులు కారం బాపిరాజుదొర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రఘురామ్

ప్రజాశక్తి -వి.ఆర్.పురం: మండల తహసీల్దార్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న గంపల రఘురామ్ (27) ప్రమాద వశాత్తు మృతి చెందిన ఘటన రాజపేట కాలనీలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే భార్య రాజమహేంద్రవరం కాలేజీలో చదువుతోంది. ఆమెను చూసేందుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఈ దుర్ఘటన జరిగిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. రఘురామ్ మృతికి తహశీల్దార్ సరస్వతి, రెవెన్యూ సిబ్బంది, పలువురు నాయకులు, అధికారులు ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుని స్వస్థలం రాజపేట కాలనీ ఆయనకు భార్య గాయత్రి (20), ఎనిమిది నెలల చిన్న పాప కూడా ఉంది.

మొరాయిస్తున్న సిగ్నల్స్‌తో అవస్థలు

ప్రజాశక్తి - సీలేరు: జికె వీధి మండలం సీలేరులో బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ సేవలు తరచూ మొరాయిస్తుండడంతో వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. యూనియన్ బ్యాంకులో గత మూడు రోజులుగా బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ సక్రమంగా పనిచేయకపోవడంతో లావాదేవీలు నిలిచిపోయి ఖాతాదారులు ఇబ్బందులు పడ్డారు. ఫిర్యాదు చేయడానికి సీలేరు బిఎస్ఎన్ఎల్ ఆఫీసులో సిబ్బంది లేకపోవడంతో ఎవరితో చెప్పుకోవాలో తెలియక వినియోగదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా బిఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్

పెదబయలు సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

ముంచంగిపుట్టు : ఎలక్ట్రికల్ ఇంజినీర్ వేణుగోపాల్‌కు కరపత్రం ఇస్తున్న సిఐటియు మండల కార్యదర్శి శంకరరావు

ప్రజాశక్తి-చింతపల్లి : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థల్లో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని సీఐటీయూ అల్లూరి జిల్లా అధ్యక్షులు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను సంస్థల్లో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, గ్రేడ్-2 జేఎల్ఎంలకు ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని, రెగ్యులర్ ఉద్యోగులకు నాలుగు పెండింగ్ డీఎల్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతలు రాజబాబు, ఎం.సత్యనారాయణ, సిహెచ్.శేఖర్, ప్రసాద్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు : పెదబయలు మండలం కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని బుధవారం సబ్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు బోండా సన్నిబాబు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో 10, 15 సంవత్సరాల నుండి అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు నాగరాజు, మూర్తి, గోపాల్‌రావు, రామారావు, మోహన్‌రావు సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు : విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ హెచ్- 176 (సిఐటియు) పిలుపు మేరకు మండలంలో విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ వేణుగోపాల్‌కు సమస్యలతో కూడిన కరపత్రాన్ని బుధవారం సిఐటియు మండల కార్యదర్శి శంకర్రావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికుల్ని సంస్థల్లో విలీనం చేసి రెగ్యులర్ చేయాలన్నారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఒకే క్యాడర్ - ఒకే వేతనం ఇవ్వాలని కోరారు. జెన్కో ట్రాన్స్కో, డిస్కం, ప్రైవేటీకరణ విధానాలు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు శ్రీను పాల్గొన్నారు.

'ఎన్‌టిఆర్ వైద్యసేవ'లు పునరుద్ధరించాలి

ముఖ్యమంత్రి చంద్రబాబుకు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు లేఖ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎన్‌టిఆర్ ఆరోగ్య శ్రీ వైద్య సేవలు తక్షణమే పునరుద్ధరించి ప్రజల ప్రాణాలను కాపాడే చర్యలు తీసుకోవాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆయన లేఖ రాశారు. ఎన్‌టిఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రులు సేవలను నిలిపివేయడంతో విశాఖ జిల్లాలోని సుమారు 65 ఆసుపత్రులలో వైద్యసేవలు అందడం లేదని వివరించారు. ఉత్తరాంధ్ర, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన పేదరోగులు ఇబ్బంది పడుతున్నారని ఆయా కుటుంబాలు తీవ్ర ఆందోళనతో ఉన్నాయని పేర్కొన్నారు. రోగులను ప్రభుత్వ ఆసుపత్రులకు షిఫ్ట్ చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా రోగులకు తగ్గట్లు డాక్టర్లు, సిబ్బంది, మౌలిక సదుపాయాలు లేక సరైన వైద్యం అందడంలేదని వివరించారు.

గత 13 రోజులుగా వేలాదిమంది రోగులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఎన్‌టిఆర్ ఆరోగ్య శ్రీ సేవలు పునరుద్ధరణకు చర్యలు తీసుకోకపోవడం సరికాదని విమర్శించారు. కార్పొరేట్లకు, బడా పారిశ్రామిక వేత్తలకు, సంపన్నులకు రూ.వేలకోట్లు రాయితీలు, సదుపాయాలను చంద్రబాబు ప్రభుత్వం ఆగమేఘాలపై ప్రకటిస్తుందని, వేలాదిమంది ప్రజల ప్రాణాలను కాపాడడానికి వైద్యం కోసం అవసరమైన నిధులను విడుదల చేయకపోవడం ప్రజల జీవించేహక్కుకు తిలోదకం ఇవ్వడమే అవుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే కలుగజేసుకొని ఎన్‌టిఆర్ వైద్య సేవలు పునరుద్ధరించే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

25న 'మట్టిమనిషి' నాటక ప్రదర్శన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సుప్రసిద్ధ రచయిత్రి డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి రచనల్లో తలమానికంగా నిలిచి, 14 భారతీయ భాషల్లోకి అనువదించబడిన 'మట్టిమనిషి' నవల ఆధారంగా రూపొందించిన నాటకాన్ని ఈనెల 25వ తేదీ సాయంత్రం 5.45 గంటలకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ప్రదర్శించనున్నట్లు అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు తెలిపారు. బుధవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మట్టి మనిషి నవల ఆధారంగా అరసం ప్రధాన కార్యదర్శి, నాటక రచయిత వల్లూరు శివప్రసాద్ నాటకంగా మలచగా, ఎస్.ఎం.బాషా దర్శకత్వంలో హైదరాబాద్, గుంటూరు, తెనాలి, విజయవాడ, ఏలూరు పట్టణాలలో 50 మంది నటీనటులు, సాంకేతిక నిపుణులతో విజయవంతంగా ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలను పొందిందని వివరించారు. మట్టికీ మనిషికీ సామాజికంగా ఉండే సంబంధాలు, వాస్తవంగా చిత్రించిన నవలకు దృశ్యరూపకం మట్టిమనిషి అన్నారు. భూమిని వ్యాపార దృష్టితో అమ్ముకొనే జీవితాలలోని దుష్ఫలితాలకు అద్దం పట్టే ఈ నవల మాస్టర్ పీసెస్ ఆఫ్ ఇండియన్ లిటరేచర్ కాలమ్లో ప్రస్తావించిన - నన్నయ్య నుంచి నేటివరకు వెయ్యి సంవత్సరాల తెలుగు సాహిత్యంలో వచ్చిన గొప్ప రచనల్లో 'మట్టిమనిషి' పదమూడో రచనగా పేర్కొనబడిందని తెలిపారు. ఈ నాటకాన్ని అభ్యుదయ రచయితల సంఘం, మార్క్సిస్టు అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ప్రదర్శిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రదర్శనను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. వివరాలకు 9849317608, 9440878247 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

డాక్టరేట్ అవార్డు అందుకుంటున్న కించే శకుంతల

అధ్యాపకులు కించే శకుంతలకు డాక్టరేట్

ప్రజాశక్తి - చింతూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర విభాగాధిపతి కించే శకుంతల, ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ నుంచి డాక్టరేట్ పొందారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.కె.రత్నమాణిక్యం అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో రసాయనశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ సముద్ర నిల్ పాల్ మార్గనిర్దేశకత్వంలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ పొందారు. ఈ పరిశోధన మూలంగా చవకైనా ఉత్ప్రేరకాలు ఉపయోగించి పర్యావరణ అనుకూలమైన సింథటిక్ మార్గాల ద్వారా బైఎరైల్స్, క్వినాజోలినోన్స్ వంటి ఔషధాలకు సంబంధించిన ముఖ్యమైన సమ్మేళనాలను అభివద్ధి చేయడం, క్లిష్టమైన ఆరోగ్య సంరక్షణ సవాళ్లను పరిష్కరించడమే కాకుండా రసాయన పరిశోధనలో సుస్థిరమైన పద్ధతులను కూడా ప్రోత్సహిస్తుంది. పరిశోధనలో తనకు సహకరించిన ప్రొఫెసర్. సముద్రనిల్ పాల్, తన భర్త అద్దంకి సుధాకర్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు పూనెం సత్యనారాయణ స్థూపావిష్కరణ

ప్రజాశక్తి-విఆర్‌పురం: అమరజీవి కామ్రేడ్ పూనెం సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా రేఖపల్లి సెంటర్‌లో నిర్మించిన ఆయన స్థూపావిష్కరణ కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్టు సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అంతా తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

డాక్టర్ మాదినకు పద్మశ్రీ ఐవి.సుబ్బారావు 'రైతు నేస్తం' పురస్కారం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పద్మశ్రీ ఐవి.సుబ్బారావు రైతు నేస్తం పురస్కారానికి విశాఖపట్నం పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మాదిన ప్రసాదరావును ఎంపిక చేసినట్టు రైతు నేస్తం చైర్మన్ పద్మశ్రీ యడ్లపల్లి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురస్కారాల కార్యక్రమం ఈ నెల 26వ తేదీన హైదరాబాద్ శంషాబాద్ దగ్గర ఉన్న స్వర్ణభారత్ ట్రస్ట్‌లో రైతు నేస్తం, ముప్పవరపు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఈ పురస్కారం అందచేస్తారని తెలిపారు. డాక్టర్ మాదినకు రైతు నేస్తం పురస్కారం ప్రకటించడం పట్ల రాష్ట్ర పశుసంవర్ధక డైరెక్టర్ డాక్టర్ దామోదర్‌నాయుడు, అదనపు డైరెక్టర్ డాక్టర్ ఎండ సింహాచలం, విశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శంకరరావు, ఉప సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం అందించే అత్యున్నత మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న, అర్జున, ద్రోణాచార్య అవార్డులతో పాటు రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారాలకు సంబంధించి అర్హులైన క్రీడాకారులు ఈ నెల 28వ తేదీ రాత్రి 11:59 గంటల లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విశాఖపట్నం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. అభ్యర్థులు www.dbtyas-sports.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

దివాకర్ రాయ్ మృతికి సంతాపం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రా యూనివర్సిటీ మాజీ ఆచార్యులు, 1980 - 90లో భారత నాస్తిక సమాజంలో క్రియా శీలకంగా పనిచేసిన ప్రముఖ హేతువాది ప్రొఫెసర్ కెఆర్.దివాకర్‌రాయ్ మృతి పట్ల భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షులు వై.నూకరాజు సంతాపం తెలిపారు.